# క్రాస్ టాక్

## పి. మధుసూదన్

'హలో... హలో... అమరావతి వెంకటేశ్వరరావేనాండీ మాట్లాడ్డం'

ఆ... నేనే చెప్పండి.

నిన్నట్నుంచి ట్రై చేస్తున్నాను సార్.

దేనికీ?

మీతో మాట్లాడ్డానికే, నండీ!

ఇంతకూ ఎవర్నాయనా నువ్వు. నాకు క్షణం తీరిక లేదు. త్వరగా చెప్పు.

ఏమిటా పరాచికాలు – బాకీపదివేలు మొన్ననే ఇచ్చి చస్తానన్నావు. అతీ గతీ లేదు. పైగా నేను ఫోన్ చేస్తే ఎవర్నని అడుగుతావా? నా డబ్బు ఎప్పుడిచ్చి చస్తావో చెప్పు? అసలే ఎస్టీడీ.

బాబూ! నేను చచ్చే ఇక్కడికి వచ్చాను. ఇక చావేమిటి బతుకేమిటి? నీ పిచ్చికాకపోతే.

నేను లక్ష్మీపతిని – నీకు వడ్డీకి పదివేలు డబ్బిచ్చి– వడ్డీ వదలి – అసలు కోసం నీ చుట్టూ తిరుగుతున్న దరిద్రుడ్ని. ఇప్పటికైనా గుర్తుకు వచ్చానా–

ఎందుకు నాయనా అంతంత మాటలు. నాకే చాలా మంది బాకీ ఉన్నారు. ఆ లెక్కలన్నీ నీకెందుకుగానీ – నీ వెంకటేశ్వరరావు ఇటువస్తే లక్ష్మీపతి ఫోన్ చేశాడని చెప్తాలేసరేనా? ఓరి దేవుడా – నెంబరు కరెక్టుగా నొక్కాను – ఒరే ఎంకిగా గొంతు మార్చి నన్ను మోసం చేయాలనుకోలేవు. మనుషుల్ని పెట్టి డబ్బు వసూలు చేయిస్తా. నీ అంతు చూస్తా. లక్ష్మీపతి అంటే ఏమనుకుంటున్నావో లక్ష్మీపతా – మజాకా?

వసూలు ఏమిటి పిచ్చి తండ్రి. ఇక్కడికొచ్చాక. మళ్లీ వెళ్లడమేముంది? ఇక్కడే సెటిలైపోవాలిగానీ. అవతల ఇంద్రుడు గొడవ చేస్తాడు – నే వెళ్లి పాడాలి.

పాడడమేమిట్రా బాబూ! ఇంతకూ ఎవర్నువ్వు.

నాయనా ఇది అమరావతి. నేను ఘంటసాల వెంకటేశ్వరరావును ఫోన్‌లో ఈ మధ్య తెలుగు వినక చాలా రోజులైంది. తెలుగు మాట్లాడుతుంటే ఓపికగా వింటూ ఉన్నా.

ఎంకిగా నువ్వెన్ని డ్రామాలాడినా నేను నమ్మను.

ఎంకికాదు బాబూ! నేను ఘంటసాలను.

ఛీ– మళ్లీ అదేమాట.

లేదు బాబు నిజం!

ఏమిటి నమ్మకం!

నీ ఎస్టీడీ బిల్లు మీటర్ ఆపేయనా. కాసేపు ఫ్రీగా మాట్లాడనూ వచ్చు. నీకు నమ్మకమూ కుదురుతుంది.

ఇదో డ్రామానా! పోనీ ఆపు మీటర్ అదీ చూద్దాం.

టక్కుమని మీటర్ ఆగిపోయింది. లక్ష్మీపతి గుండె గుభేలుమంది. అయినా అనుమానం పెనుభూతంలా కాకపోయినా చిన్న భూతంలా ఉంది. ఓ ఆలోచన తట్టింది లక్ష్మీపతికి. ఇంతదాకా 70 రూపాయలైంది. ఆ బిల్లు వెనక్కు తిప్పమంటే డబ్బుకు డబ్బా మిగులుతుంది. ఒక వేళ ఘంటసాలే అయితే చాలా విషయాలు ఫ్రీగా మాట్లాడేసుకోవచ్చు.


'బిల్లు జీరోకు తిప్పండి. అప్పుడు నమ్ముతాను' అన్నాడు పతి.

రయ్‌మని అంకెలు వెనక్కు తిరిగాయి.

అయ్యబాబోయ్ నిజంగానే... గట్టిగా అరవబోయాడు. కానీ పక్కనున్న వారు కూడా ఆయనతో మాట్లాడతామంటే – తన ప్రత్యేకత ఏం కావాలి! అందుకే గొంతు తగ్గించి విశేషాలు ప్రారంభించాడు

'అవును–నేను అమరావతికిగదా చేశాను. మీకెలా కనెక్ట్ అయింది. భలే ఆశ్చర్యంగా ఉందే! అన్నాడు.

'నువ్వు చూశావో లేదో– టెలిఫోన్ డైరెక్టరీలో అక్షర క్రమంలోనే ఎస్టీడీ నంబర్లుంటాయి. అలాగే మాకూ నంబర్లున్నాయి. నీకు తెలుసో తెలీదోగానీ – ఇప్పుడంతా శాటిలైట్ టెలికమ్యూనికేషన్ కదా బాగా పని చేస్తున్నాయి. ఆ మధ్య నరకానికీ స్వర్గానికీ తేడాలేకుండాపోతోందని ఇంద్రుడూ, అష్టదిక్పాలకులు, నవగ్రహాల అధిపతులు వైకుంఠపురంలో మహావిష్ణువు సెక్రటేరియేట్ వద్ద నిరాహారదీక్షలు చేసి, స్వర్గంలో కనీస అవసరాలు ఉండాలని డిమాండ్ చేశారు. అప్పుడు విష్ణువు ఇక్కడ హంస తూలికాతల్పాలూ, అందమైన పరిచారికలను పెంచడానికి ఒప్పుకుంటుండగా నారదుడు వచ్చి 'మీరెంత మూర్ఖులు – ఓసారి కింద భూలోకంలో చూడండి. ఫోన్‌లు, ఫ్యాన్‌లు, ఫ్యూన్‌లు, టీవీలు, మీట నొక్కితే ఛానెళ్ళు, ఫ్రిజ్‌లు...' అంటూ ఏవేవో చెప్పాడు. మావాళ్లకు వాటి మీద కన్నుపడింది. వెంటనే కొత్త డిమాండ్లు పెట్టి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించేసరికి విష్ణువు తల తిరిగింది.



చివరికి లేటెస్ట్ ఫెసిలిటీస్ అన్నిటినీ అమరావతికి గ్రాంట్ చేశాడు. అయితే ఏది మిస్ యూజ్ చేసినా కట్ చేస్తాపోతానని మెలికపెట్టాడు. దాంతో ఫోన్ విషయంలో ఇన్‌కమింగేగానీ, అవుట్ గోయింగ్ లేదు... అంటూ అమరావతీలో లేటెస్ట్ టెక్నాలజీ గురించి వివరంగా చెప్పాడు.

లక్ష్మీపతికి నమ్మకం కుదిరింది.

'మీరప్పుడు గుంటూరికి వచ్చారు. నేను జనం మధ్యలోంచి వచ్చి మీకు పూలదండలేశాను. అప్పుడు నా చెప్పులు కూడా తెగిపోయాయి. మా మునిసిపల్ ఛైర్మన్ నేను వాడి ఎక్స్‌పార్టీవాడ్నని మీకు చెవిలో కూడా చెప్పాడు– నేను మీతో కరచాలనం చేయబోతే వాడి మనుషులు నన్ను పక్కకు నెట్టేశారు. గుర్తొచ్చానాండీ!' అన్నాడు చాలా ఉత్సాహంగా లక్ష్మీపతి.

'ఏమోనాయనా ఎవరుబట్టలు చించుకున్నారో ఎవరు చెప్పులు తెంచుకున్నారన్నది నాకు గుర్తుండి చావదు' చాలా రోజుల తరువాత ఆంధ్ర మంచి మాటలు వినబడుతున్నాయి.

'అదేమిటండీ ఈ మధ్య చచ్చిన వాళ్లెవరూ స్వర్గానికి రాలేదా' ధర్మ సందేహం అడిగాడు పతి.

'మొరార్జీదేశాయ్, రంగా– రామిరెడ్డి ఎవరెవరో వచ్చారయ్యా.'

'ఇంకేం వాళ్ళనడగచ్చుగా'

'ఇంద్రుడ్ని దించడానికి ఒకరి తరువాత ఒకరు మొరార్జీని సలహాలు అడిగి వస్తున్నారు. ఆయనకు క్షణం తీరిక లేదు. ఆ మధ్య రహస్యంగా ఇంద్రుడు కూడా కలిసి వచ్చాడట. నందేళ్ల మనిషి ఎవరికేం చెప్తున్నాడో పెరుమాళ్లకే ఎరుక

రామిరెడ్డి చదువరి. పలకరించి వద్దామనుకుంటే. ఇక్కడ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటరేదో ఆయన చేత పెట్టిస్తారట. బృహస్పతికి వైస్ ఛాన్సలర్ పదవిపోతుందని ఒకటే దిగులు. రామిరెడ్డి ఎక్కడికెళ్తే అక్కడికెళుతున్నాడు బృహస్పతి. రాత్రిళ్లు ఆయన దగ్గర ట్యూషన్ కూడా చెప్పించుకుంటున్నట్లు అంటున్నారు.'

'స్వామీ ఆగండి ఈ గొడవలేవీ నాకు తెలీవు...' అంటూ మధ్యలో అడ్డు తగిలాడు పతి.

'పోనీ నీకేం తెలుసు?'

'మీ గురించే స్వామి! ఆ పాటలు... ఆ సంగీతం...' అంటూ తన్మయంతో చెప్పాడు.

'ఎందుకయ్యా... మ్యూజిక్ బాగా డెవలప్ అయ్యిందిగా!'

'అదే స్వామీ మ్యూజిక్ మాత్రమే డెవలప్ అయి గూబలు గుయ్' మంటున్నాయి. గాత్రం అసలు వినిపించడం లేదు. సూపర్ హిట్ సాంగ్స్ జీ... ఏ... ఎవ్.... జీ... గ్యాంగ్... గ్యాంగ్; అచ్చం పేట... బుచ్చంపేట...; ఛిమ ఛిమ ఛిమా... ఛింఛిమా; లక్కు లకడి గిక్కు లకడి...; ముక్కాలా... ముక్కాబులా... లేలా... ఈ పాటలేవీ వినలేదా స్వామీ!'

'వింటున్నానయ్యా! ఆ మధ్యయితే ఓ రోజు కృష్ణ శాస్త్రి వచ్చేశాడు పాపం! 'అవ్వా... బువ్వా... గువ్వా.. నవ్వా... అన్నీ నీకే ఇవ్వాగా' అన్న పాటేదో ఆయన పాటకు ముందువేశారట. ఆ రోజు మంచి కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. ఆయన బాధ చూస్తుంటే ఈ వసతులు ఎందుకన్నా వచ్చాయనిపిస్తోంది. ఆత్రేయ ఓదారుస్తున్నాడు. అయినా ఆయన వింటేగా– ఎవడ్నని ఏం లాభం లే. సావిత్రి అసలు ఇక్కడ మనుషులతోనే మాట్లాడ్డం లేదు. మానవ జాతి మీదే ఆమెకు అసహ్యమట. మేమంతా చెప్పి చూశాం. అయినా పెదవి విప్పడం లేదు. మొన్ననే వి.సి.ఆర్.లో మాయా బజార్, మూగ మనసులు అవీ వేసినపుడు ఆమె నటన చూసి ఆమెకు ద్రోహం చేసిన వాళ్లకు నరకంలో శిక్షలు ఎక్కువ చేయడంతోపాటు – స్త్రైప్స్ కూడా పొడిగించాడట ఇంద్రుడు. ఇంద్రుడి సజెషన్‌కు యముడు ఓకే చేశాడట. చెప్పడం మరచిపోయాను – ఆత్రేయ ఇక్కడ సంస్కృతంలో మనసు పాటలు రాస్తున్నాడు. మొన్నయితే మరీ ఇబ్బందయింది. ఫారిన్ నుంచి హైలెవెల్ డెలిగేట్స్ వచ్చారు. ఇంద్రుడు కచేరీ పెట్టించాడు. ఆత్రేయ చేత పాట రాయించుకుని వచ్చి నన్ను పాడమన్నారు. టైం అయిపోతోంది ఆయనేమో రాయడు. చివరకెలాగో మేనేజ్ చేశాను'.

'ఎలా స్వామీ?'

"మనసు గతి ఇంతేనః
మనిషి బ్రతుకింతే నమః
మనసున్న మనిషికీ
సుఖములేదనః...
అంతామృత్పిండం... అదీ ఒక మాయామః..." అంటూ

అదే రాగంలో పాడేశాను. ఫారినర్స్‌కు తప్ప అందరికీ విషయం అర్థమయింది. అయినా ఏం చేయలేరు. పైగా నన్నభినందించారు. ఇంద్రుడు ఆత్రేయ నేదో అనబోతే ఆదుర్తి అడ్డుపడి అదీ ఆయన రాసిందే కొంప లేం మునగలేదులెమ్మని సర్ది చెప్పాడు...' అని వివరించాడు ఘంటసాల.

"స్వామీ మీ విగ్రహం హైదరాబాద్‌లో అప్పట్లో బాలు పెట్టాడు తెలుసుకదా" అన్నాడు పతి.

'ఆ... ఆ... ఆ రోజు ఇంద్రుడు మొహం మాడ్చుకుని కూర్చున్నాడు. విగ్రహం ప్రతిష్టించే సమయానికి మా సభ జరుగుతోంది. మనవాళ్లంతా నన్నభినందించేసరికి ఇంద్రుడు తెగ అవమానంగా ఫీలైపోయాడు. తరువాత రోజు న్యూస్ చూసి ఇంద్రుడు కాస్త ఆనందించినట్టున్నాడు సభ రసాభసా అయిందని. అయినా ఆరు కోట్ల ఆరాధ్య దైవం అలా మాట్లాడ్డమేమిటి బాలు ఏడవడమేమిటి? ఎందుకో నాకూ చాలా అవమానంగా అనిపించింది. ఎన్టీఆర్ అయితే 'ఛీ... దుర్మార్గులు' అని తరువాత మాట్లాడలేక పోయాడు. రేలంగి – రాజబాబు వచ్చి ఓదార్చారు. ఇంకెప్పుడూ నా విగ్రహాలు ప్రతిష్టించకూడదు – ప్రతిష్టించినా బుర్ర బుర్రలోనే ఉన్నవాళ్లు తప్ప మిగిలిన వాళ్లు నా గురించి మాట్లాడకూడదు అనుకున్నాను.'

'రేలంగి ఎలా ఉన్నాడండీ'

'చార్లీ చాప్లిన్... ఆయనా భలే దోస్తులిక్కడే వారి చేష్టలకు నవ్వలేక ఛస్తున్నాం మేమంతా... అయినా అదేమిటయ్యా మొన్న అదేదో సినిమా చూశాను పొద్దుపోక... గోచీగుడ్డలు... ఒకడ్ని ఒకడు తన్నుకోవడం, ఆడో మగో తెలీని వెకిలి వేషాలు తుమ్మ మొద్దులు, బొగ్గు దిమ్మెలు వాళ్ళ హాస్యమేమిటి? మీరు చూడ్డమేమిటి? అది చూసి ఇంద్రుడు వాంతి చేసుకుంటే అదో మేజర్ ప్రాబ్లెం అయి ధన్వంతరి తల్ప్రాణం తోకకు వచ్చింది. తెలుగు సినిమాలు చూసి వాంతి చేసుకున్నా, పిచ్చి పట్టినా ఇక వైద్యం చేయించబోమని బహిరంగంగా ప్రకటించారు. ఇక్కడున్న తెలుగు వాళ్లకు తల తీసేసినట్టయింది. వేరే దేశాల నుంచి వచ్చినవాళ్లు కొత్త తెలుగు సినిమాలను బ్లూ ఫిలింల కంటే 'పరమ పవిత్రం'గా చూస్తున్నారు. నిర్మాతలకు అసలు బట్టల ఖర్చే ఉండడం లేదు.

అదేదో కొత్త సినిమాను ఫారిన్ వెధవ ఒకడు రహస్యంగా రికార్డు చేసి మళ్లీ మళ్లీ వేసుకుని చూస్తుంటే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తెలుగు సినిమాలను నిరవధికంగా బ్యాన్ చేశారు. చివరికి ఎన్టీఆర్ లాంటి ఎత్తూలావు ఉన్న వాళ్లను ఇంద్రుడి దగ్గరికి పంపితే ఇంద్రుడు మొదట కుదరదన్నాడట. మిగిలిన ఛానెల్స్‌లో ఇంకా దారుణంగా ఉన్నాయి కదా! అంటే దొరికామురా దేవుడా అనుకుని ఏ భాషవారికి ఆ ఛానెల్స్ మాత్రమే అన్నాడట. సరే ఏదో ఒకటి లెమ్మనుకుని మనవాళ్లు వచ్చేశారు.

ప్రభుదేవా తెలుసాండీ మీకు – చూశారా? 'ఎందుకు తెలీదు బాబూ! ఆ ఎముకల్లేని మనిషిని చూసేకదా ఇంద్రుడు – రంభను అలా డ్యాన్స్ చేయమనడం – ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించడం... ఓ అదో పెద్దరాద్ధాంతం! చివరికి త్రిమూర్తులు ఇన్వాల్వ్ అయ్యి ఆ ప్రభుదేవా నామధేయుడ్ని ఫారిన్‌లో పుట్టించాల్సి ఉండగా లెడ్జర్‌లో ఏదో మిస్టేక్‌వల్ల మద్రాసు పద్దులో పడ్డాడనీ –అతగాడికి ఎముకలు ఉన్నా వాటికి ఎముకల లక్షణాలు ఉండవనీ, అది కూడా పొరబాటునే జరిగిందని చెప్పేసరికి సమస్య ఒక కొలిక్కి వచ్చింది.

ఆమె ఆత్మహత్య ప్రయత్నంతో అమరావతిలో టీ.వీ.లు – ఛానెళ్లు అన్నీ తీసేశారు. కాస్త అలవాటయ్యాక తీయడంతో ఇబ్బందిగా ఉన్నా – ఇప్పుడిప్పుడే షాక్ నుంచి అంతా కోలుకుంటున్నారు. నాయనా ఇంకా చాలా విశేషాలున్నాయి. ఇంద్రుడు మళ్లీ ఊరికే కోప్పడతాడు తరువాత 'ఎప్పుడైనా ఫోన్ చెయ్యి లైన్ దొరికితే మాట్లాడుతా' అంటూ లైన్ కట్ చేయబోతుంటే – 'స్వామీబిల్లు...' పతి సందేహం.

'తిరగదులేవయ్యా...' ఘంటసాల భరోసా.